
ప్రజాశక్తి
శనివారం 24 మే 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





పారిశుధ్య పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం స్థానిక 15వ డివిజనులో పర్యటించారు. వార్డు సచివాలయంలో పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను పరీక్షించారు. వార్డులోని అన్ని బ్లాక్ స్పాట్స్ జీవీపీ పాయింట్స్ ను పరిశీలించారు, మొత్తం ఆరు బ్లాక్ స్పాట్ లో రెండు గ్రీన్స్ పార్క్స్ గా మార్చగా మిగిలిన నాలుగు కూడా గ్రీన్ స్పాట్స్ గా మార్చేందుకు ప్రణాళికను సూచించారు. వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్మికుల కాలువ పూడికతీతను పరిశీలించారు. పూడికతీత కార్యక్రమం చేపట్టి ఒక వారం కాగా ఇంకొక వారంలో వార్డు మొత్తంలో కాలువల పూడికతీత చేయించాలని సూచించారు. ప్రతిరోజూ వార్డులోని సెక్రటరీలు వార్డు మొత్తం తిరిగి అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా సూచనలిచ్చారు.




పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లూరును అగ్రభాగాన నిలుపుదాం...!

- టిడిపి మహానాడు తీర్మానం
- భారీగా నాయకులు, కార్యకర్తలు హాజరు
- ఎంఎల్ఏ ప్రంసంగాలతోనే సరి
- క్యాడర్ అభిప్రాయాలకు చోటులేదు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలపాలని టిడిపి జిల్లా మహానాడు ఏక గ్రీవ తీర్మానం చేసింది. శుక్రవారం స్థానిక విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా మహానాడు నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన మహానాడు మధ్యాహ్నం 1.30 గంటలకు ముంగించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి. నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరు నాగేశ్వరరావుతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాత్రమే ప్రసంగించారు. 10 తీర్మానాలకు మహానాడు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఒక్క నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలు చెప్పడానికి అవకాశం ఇవ్వలేదు. పార్టీ మహాసభ అంటే పార్టీలో పెడధోరణాలు, కార్యకర్తల సమస్యలు, పార్టీని బలోపేతం చేయడానికి ఏం చేయాలనే చర్చ ఎక్కడా సాగలేదు. కేవలం అభివృద్ధి విషయం మాత్రమే ప్రస్తావించారు.



మాజీ సిఎం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలేస్తున్న నాయకులు

నెల్లూరును అగ్రభాగాన నిలుపుదాం..!

నెల్లూరు జిల్లాకు అభివృద్ధిలో అగ్రబాగాన నిలిపాలని టిడిపి మహానాడు ఏక గ్రీవంగా తీర్మానించింది. ఆపార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పది తీర్మానాలకు మహానాడులో ప్రవేశపెట్టారు. దానికి ఆమోదం తెలిపారు. సోమశిల నుంచి 23 మండాలకు నీరు అందించే జలజీవన్ మిషన్ పథకం కింద రూ.8,398 కోట్లతో తాగునీటి పథకానికి డిపిఆర్‌కు కేంద్రానికి పంపారని, దానిని ఆమోదించాలని, 2. సోమశిల, కండలేరు ప్రాజెక్టులకు సమగ్రం గా తీర్చిదిద్దాలని 3. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనూ, కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని, 4. నెల్లూరుకు కొత్త కలెక్టరేట్‌ను నిర్మించాలని, 5 కనుపర్తిపాడు వద్ద 28 ఎకరాల్లో నూతనంగా క్రికెట్ స్టేడియం నిర్మించాలని, 6. దగదర్తి విమానాశ్రయం పూర్తి చేయాలని, 7 . జువ్వలదిన్నె వద్ద షిపింగ్ హర్బర్ పూర్తి చేయాలని, 8. పొట్టేపాళెం బ్రిడ్జిని నిర్మించాలని, 9. ముత్తూరు నేలటూరు వద్ద ఫిషింగ్ జెట్టిని పూర్తిచేయాలని, 10. ఎన్.టి రామారావుకు భారత రత్న ఇవ్వాలని మహానాడులో తీర్మానం చేశారు..

కార్యకర్తల ఊసే లేదు..!

పార్టీ మహాసభల్లో పార్టీకి సంబంధించి ఉన్న ఇబ్బందులు చర్చిస్తారు. ప్రతి సంవత్సరం జరిగే మహానాడులో ప్రధానంగా పార్టీ అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేస్తారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుంది. పార్టీలో ఇబ్బందులు, కార్యకర్తల కష్టాలు, ఏం చేయాలని, ఎలా చేయాలని అభిప్రాయం నాయకులు , కార్యకర్తల నుంచి తీసుకుంటారు. నియోజకవర్గాల్లో జరిగిన మినీ మహానాడులో చర్చించినా జిల్లా స్థాయిలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు చెప్పడానికి అవకాశం ఇవ్వాల్సి ఉంది. కేవలం ఎంపి,ఎంఎల్ఏ ల ప్రసంగాతోనే సరి పెట్టారు. మహానాడుకు జిల్లా వ్యాపితంగా పెద్ద ఎత్తున ఆపార్టీ నాయకలు, కార్యకర్తలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత ఎస్‌వి రమేష్ బాబు

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు నగరంలోని సరస్వతి నగర్ చెన్నయ్ ఇన్ఫర్మేషన్ హాస్పిటల్స్ లో 25వ తేది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెన్నయ్ హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత ఎస్‌వి రమేష్ బాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చెన్నయ్ హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ స్థాపించి13 ఏళ్ళుపూర్తి చేసుకొని 14వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా చెన్నయ్ హాస్పిటల్ పాలి క్లినిక్స్ ను ప్రారంభిస్తున్నామనన్నారు. చెన్నయ్ హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ప్రారంభించిన ఈ 13 సంవత్సరాల నెల్లూరు జిల్లాలోని ఎన్నో వేలమందికి చెన్నైలోని వివిధ హాస్పిటల్స్‌లో వైఎస్సే వాళ్లకు సహకారం అందించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కోవిడ్ సమయంలో నెల్లూరులో తీవ్రమైన కోవిడ్ తో బాధపడుతున్నటువంటి వారికి ఎంతో సహకారాన్ని మా సెంటర్ ద్వారా అందించడం జరిగిందని తెలిపారు.ఈ మెగా వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ పి. శ్రీధర్ రెడ్డి, కీళు ఎముకలు, నరాల చికిత్స వైద్య నిపుణులు నిఖిలా రెడ్డి పుట్టా, చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ జి. ఇందిరా, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ పి. రవి, డాక్టర్ ఎన్ రాజరాజేశ్వరి హాజరై ఉచిత సేవలు అందిస్తారన్నారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని సుగరు, బిపి, ఇసిజి కన్సల్టేషన్ అన్ని ఉచితంగా చూస్తామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 89773 09990 లేదా 0861- 233 9990 ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీధర్ రెడ్డి, రాజేశ్వరి,అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కరోనా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు

- ప్రభుత్వానికి ప్రజా ఆరోగ్య వేదిక సూచన

ప్రజాశక్తి-నెల్లూరు

కరోనా మహమ్మారి తిరిగి విజృంభిస్తున్న తరుణంలో రాష్ట్రంలో ఈ ప్రాణాంతక వైరస్ వ్యాప్తి చెందకుండా రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు తీసుకోవాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా ఆరోగ్య వేదిక కొన్ని సలహాలు , సూచనలు చేసినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టరు ఎం.వి.రమణయ్య, టి.కామేశ్వరరావు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా న్యూస్ ప్రసారమాధ్యాల సమాచారం ప్రకారం గురువారం నాటికి వైజాగ్‌లో ఒక కరోనా కేసు, శుక్రవారం కడప జిల్లాలో మరో రెండు కేసులు నిర్ధారించబడటం పట్ల మా ఆందోళనను వ్యక్తం చేస్తున్నామన్నారు. కోవిడ్‌తో రాష్ట్రానికి గతంలో ఉన్న అనుభవం ప్రకారం ఈ వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదన్నారు. తద్వారా గణనీయమైన సవాలు ఎదుర్కోవాల్సిన అవసరం ఉంటుంది. మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి ఆరోగ్య శాఖ త్వరగా చర్య తీసుకోవాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అప్రమత్తం చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఆరోగ్య అధికారులను ప్రత్యక్షంగా సంప్రదించి, కరోనా కట్టడికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు గుర్తింపు నియంత్రణను ఏర్పాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అన్ని జిల్లాల్లోని అధికారులను ఏదైనా అనుమానిత లేదా నిర్ధారించబడిన కరోనా కేసుల డేటాను చురుకుగా సేకరించి నివేదించమని ఆదేశాలు జారీ చేయాలన్నారు. గత కోవిడ్ అనుభవాల ఆధారంగా, వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి కేసులను వేరుచేయడం, కాంటాక్ట్ ట్రేసింగ్ ప్రభావిత ప్రాంతాలలో స్థానికీకరించిన ఆంక్షలు వంటి నివారణ చర్యలను అమలు చేయాలన్నారు. కరోనా లక్షణాలు, మాస్క్ వంటి నివారణ వ్యూహాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అన్ని జిల్లాల్లో అవగాహన ప్రచారాలను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం అన్ని జిల్లాల్లో తగినంత ఆసుపత్రి మౌలిక సదుపాయాలు, తగినంత మందుల నిల్వలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బంది, మాస్కులు, పరీక్షలు పిపిఈ కిట్‌లతో సిద్ధంగా చేయాలన్నారు. రాష్ట్రంలో కరోనా తిరిగి రాకుండా నిరోధించడానికి తక్షణ సమన్వయంతో కూడిన చర్య చాలా కీలకం. ఏదైనా అవగాహన లేదా సమాజ ప్రోత్సాహక ప్రయత్నాలలో సహాయం చేయడానికి ప్రజా ఆరోగ్య వేదిక సిద్ధంగా ఉందన్నారు.



డాక్టర్ ఎంవి.రమణయ్య

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలోని అంకమ్మ దేవాలయం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయడం సరైన విధానం కాదని ఆమ్ ఆద్మీ ,వెసిపితో పాటు కొన్ని ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. దేవాలయం చుట్టూ కొంతమంది చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని కాంప్లెక్స్ కడితే వారికి ఉపాధి పోతుందని చెప్పారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయడం వల్ల అంకమ్మ తిరునాల జరిగేటప్పుడు నిర్వహించే కార్యక్రమాలకు ఆటంకంగా తయారవుతాయని చెప్పారు. పర్మినెంట్ రూములు కట్టుకోవడం వల్ల దేవాలయ ఆచారాలకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. గదుల నిర్మాణం ఆపేందుకు కోర్టుకెళతామన్నారు.దేవాలయ ఆదాయం పేరుతో పేదల నోర్లు కొట్టొదన్నారు. విలేకరులకు సమాచారం చెప్పిన వారిలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నేతి మహేశ్వరరావు,వెసిపి కందుకూరు పట్టణ అద్యక్షుడు షేక్ రఫీ తో పాటు కందుకూరు అభివృద్ధి మండలి నాయకులు పాలేటి కోటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, బి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలోని ఓ లాడ్జిలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో కందుకూరు పట్టణ ఎస్ఐ వి. సాంబశివరావు తన సిబ్బందితో శిబిరంపై దాడి చేసి 9 మందిని శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 29,640 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ వి. సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. లాడ్జి యాజమాన్యంపై కేసు నమోదు చేశామన్నారు.



మమ్మల్ని 'ప్రకాశం'లో కలపండి

- కందుకూరు ఎంఎల్ఏ డిమాండ్
- భారీగా పాల్గొన్న కందుకూరు తెలుగు తమ్ముళ్లు ...

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయాలని ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వర రావు కోరారు. నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు పార్లమెంట్ మినీ మహానాడు జరిగింది. రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ,ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా శాసనసభ్యులు ప్రజా ప్రతినిధులతో కలిసి కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం బాగా వెనుకబడిన ప్రాంతమన్నారు. నియోజకవర్గంలో జరిగిన మినీ మహానాడులో నియోజకవర్గంలోని 7 ప్రధాన సమస్యలపై తీర్మానం ప్రవేశపెట్టారు, అమోదించారు.గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలను అస్తవ్యస్తంగా విభజించి, కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లా నుంచి నెల్లూరు జిల్లాలో కలిపి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలని ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నానని తెలిపారు.రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సోమశిల ఉత్తర కాలువ ద్వారా 1.5 టీఎంసీ నీటిని తీసుకురావాలని ప్రతిపాదించారు. "ఈ పనులు పూర్తయితే వందల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. అనేక గ్రామాలకు తాగునీరు అందుతుందని పేర్కొన్నారు.పాలేరు, మన్నేరు నదులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం ద్వారా సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించవచ్చని, ఉలవపాడు మండలంలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మ్యాంగో మార్కెట్, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. కందుకూరు పట్టణంలో ప్రధాన ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి నార్త్ బైపాస్ రోడ్డు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలు రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణం, మెట్ట ప్రాంతమైన కందు కూరు నియోజకవర్గానికి వెలుగొండ ప్రాజెక్టు జలాలను తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ప్రతిపాదిం చారు.ఈ ప్రధానమైన సమస్యలను పరిష్కరిస్తే కందుకూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు..ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు ప్రవేశపెట్టిన పై ప్రతిపాదనలను పార్లమెంటరీ పార్టీ జిల్లా మినీ మహానాడు వేదికగా ఏకగ్రీవ తీర్మానం చేసింది. పై తీర్మానాలను కడపలో జరిగే పార్టీ మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ ు తెలియజేశారు.కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, పార్లమెంటు, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎంఎల్ఏ' ఇంటూరి'



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంఎల్ఏ ఇంటూరి

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-వలేటివారిపాళెం

మండలంలోని లింగపాలెం గ్రామంలో గురువారం రాత్రి జరిగిన వివాహ కార్యక్రమానికి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. లింగపాలెం గ్రామ నాయకులు వడ్లమూడి శ్రీనివాసరావు - పద్మావతిల కుమారుడు వివాహం లింగపాలెం గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులు వడ్లమూడి కృష్ణకాంత్ - చందన లను ఎమ్మెల్యే ఇంటూరి ఆశీర్వదించారు. అనంతరం కొద్దిసేపు స్థానిక రాజకీయ అంశాలపై ఎమ్మెల్యే గ్రామస్తులతో చర్చించారు. ఆయన వెంట గ్రామ నాయకులు మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం (చిన్నా) మన్నెం వెంకయ్య, వెంకటేశ్వర రెడ్డి, గొర్రెపాటి శ్రీను, ఘంటమనేని లక్ష్మీనరసింహం, గొర్రెపాటి మాధవ, సిహెచ్ రత్తయ్య, నాయకులున్నారు.

తాగునీరు సరఫరా చేయాలని వినతి

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 30వ డివిజన్ పరిధిలోని మల్లయ్య గుంట ప్రాంతానికి తాగునీటి సరఫరా చేసేందుకు నగర పాలక సంస్థ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మేయర్ స్రవంతి జయ వర్ధన్‌కు స్థానిక సిపిఎం శాఖ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత సిపిఎం శాఖ కార్యాదర్శి కండె కోటేశ్వరరావు మాట్లాడుతూ చిక్కు వెంట్రుకలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న మల్లయ్య గుంట (30వ డివిజన్) ప్రాంత వాసులకు తాగు నీరు సరఫరా కావడం లేదని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఈ శివారు ప్రాంతంలో కనీస మౌలిక సదుపా యాలు కార్పొరేషన్ కల్పించలేక పోవడం దారుణమన్నారు. ఈ ప్రాంత ప్రజలు మంచినీటి కోసం కటకట లాడుతున్నారని, కనీసం మరమ్మతులకు గురైన చేతి పంపును సైతం బాగుచేయలేని దుస్థితిలో కార్పొరేషన్ ఉందన్నారు. కనీసం ఈ ప్రాంతానికి వాటర్ ట్యాంకులను పంపించి ప్రజలకు మంచినీటి సరపరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చేతిపంపులు మరమ్మతులు చేయించాలని, పైపులైన్లు మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దశయ్య స్థానికులు రాజేష్, పరిచిన విజయమ్మ, ఆదెమ్మ, పోలమ్మ, సంపూర్ణ పాల్గొన్నారు.



మేయర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నిర్మాణ అనుమతులను పరిశీలించాలి

ప్రజాశక్తి-నెల్లూరు


నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి భవనానికీ నిర్మాణ అనుమతులను పరిశీలించి, అనధికార, అక్రమ కట్టడాల వివరాలను నివేదించాలని కమిషనర్ వై.ఓ నందన్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులకు నిర్దేశించిన దైనందిన కార్యక్రమాల తనిఖీలలో భాగంగా కమిషనర్ స్థానిక 18,19, 20 డివిజన్లు రామలింగాపురం, ముత్యాల పాలెం, గోమతి నగర్, శ్రీహరి నగర్, అరవింద్ నగర్, ఇస్కాన్ సిటీ తదితర ప్రాంతాలలో శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. రీ సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క వార్డు సచివాలయ కార్యదర్శి తమ పరిధిలోని ఇంటింటికి తిరిగి భవనాల నిర్మాణ అనుమతులు, అసెస్మెంట్ డిమాండ్, తాగునీటి కుళాయి కనెక్షన్ తదితర వివరాలను పరిశీలించాలని, వివరాలన్నిటిని సమగ్రంగా ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో భవనాలను కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ద్వారా కొలతలు వేయించి, ప్రస్తుత నిర్మాణాన్ని పట్టణ ప్రణాళిక విభాగం నుంచి తీసుకున్న నిర్మాణ అనుమతులతో పోల్చి చూశారు. నిర్మాణ కొలతలకు రెవెన్యూ విభాగం వారు అందించిన అసెస్మెంట్ డిమాండ్ ను సరి చూసారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని డ్రెయిను కాలువలలో పూడికతీత పనులు, సిల్ట్ ఎత్తివేత కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఇస్కాన్ సిటీ ప్రాంతంలో నూతనంగా నిర్మాణమైన సిసి రోడ్డు నాణ్యతను కమిషనర్ తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలోని ఇతర సివిల్ వర్క్స్ అన్నిటిని నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

డాక్టర్ జెడ్ఎస్ బాధ్యతల స్వీకరణ

జలమార్గాలకు కృషి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు విజన్ సాధనకు కృషి చేస్తానని డాక్టర్ జెడ్ శివ ప్రసాద్ అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఎపి ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అధికారుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం అప్పగించిన క్లిష్టమైన బాధ్యతకు వన్నె తెచ్చేందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ద్వారా రాష్ట్రానికి ఆర్థికాభివృద్ధి తో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచేందుకు పనిచేస్తానన్నారు. కోస్తా కారిడార్‌తో పాటు పెన్నా, కృష్ణా,గోదావరి, తుంగభద్ర జల మార్గాల ద్వారా అంతర్గత రవాణా పెంపునకు కృషి చేస్తానని తెలిపారు. ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు అభివృద్ధి చెందిన దేశాల్లో ముందంజలో ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ లో వీటి వినియోగం పై నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు.ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధితో పాటు పరిశ్రమలు రాక ఊపందుకుంటాయని, రాష్ట్రంలో పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. రైలు, రోడ్డు మార్గాలకు ప్రత్యామ్నాయంగా, పర్యావరణహితంగా తక్కువ ఖర్చుతో అంతర్గతంగా జలమార్గాలను అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. నెల్లూరు నుంచి విశాఖపట్నం వరకు కోస్తా కారిడార్ 975 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండటం మనకు కలిసొచ్చే అంశం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సాగరమాల ప్రాజెక్టు ప్రకటించి ఉండడం అదనపు అంశం అన్నారు. పెన్నా, కష్ణ, గోదావరి, తుంగభద్ర నదుల అంతర్గత జల మార్గాలను కోస్తా కారిడార్‌తో పాటు కృష్ణపట్నం పోర్టు కు అనుసంధానం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చునన్నారు. ప్రమాణాస్వీర ఉత్సవంలో డాక్టర్ ప్రసన్న, డాక్టర్ ప్రతీ, పెళ్లకూరు రాజేష్, గుటూరు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



సంతకం పెడుతున్న దృశ్యం

అత్యాధునిక వసతులతో విఆర్ పాఠశాల

ప్రజాశక్తి-నెల్లూరు

నిరుపేద విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కూడిన విద్య అందుబాటులోకి రానుందని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పుర పాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి నెల్లూరు నగరంలోని విఆర్ పాఠశాలలో జరుగు తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ నందన్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. విఆర్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న వసతులపై ఎంపి వేమిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గతం కంటే భిన్నంగా అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారని ప్రశంసించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... పేద పిల్లల కోసం చేపట్టిన ఈ కార్యక్రమం చాలా గొప్పదని శిథిలావస్థలో ఉన్న విఆర్ హైస్కూల్ రూపురేఖలే మారిపో యాయన్నారు. ప్లేగ్రౌండ్ అద్భుతంగా తయారు చేస్తున్నారని, తల్లిదండ్రులు పనులు ముగించుకొని వచ్చేవరకు పిల్లలు ఆడుకునేందుకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఉచిత భోజనం, స్నాక్స్, ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పించడం సంతోషకరమని, పాఠశాల నిర్వహణను నారాయణ కుమార్తె షరణి బాధ్యత తీసుకోవడం గొప్ప విషయం అన్నారు. హైదరాబాదులోని ది బెస్ట్ స్కూలుకు దీటుగా విఆర్ పాఠశాల సిద్ధమవుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా నారాయణకు, ఆయన కుమార్తె షరణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పరిశీలనలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మామిడాల మధు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



విఆర్ పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎంపి వేమిరెడ్డి

.ఇంటింటికి బౌద్ధ జ్ఞాన దీపోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు

వైశాఖ పున్నమి మాసంలో ఇంటింటికి 'బౌద్ధ జ్ఞాన దీపోత్సవంలో 'భాగంగా కందుకూరు బృందావనం కాలనీలోని దాసరి వీరానారాయణ గృహంలో దమ్మాచారి ఉపసకులు గాండ్ల హరిప్రసాద్‌చే బుద్ధ వందనం ధమ్మ ప్రవచనం జరిగింది. తదుపరి ఉపాసక హరిప్రసాద్ మాట్లాడుతు " నేడు కొనసాగుతున్న ఆధిపత్య భావాజాల అసామానతల పీడననుండి బయటపడాలంటే సనాతనమైన బుద్ధుని ధర్మమే మన ధ్ఘుఖ విముక్తికి ఏకైక మార్గమన్నారు.కార్యక్రమంలో... దాసరి వీరానారాయణ, రజని, లిఖిత్ గౌతమ్, రవిత్రేణి, రాజ్యలక్ష్మి, నీరుకొండ విజయకుమార్, మెడబలిమి చలపతి, మెడబలిమి మాధవరావు పాల్గొన్నారు.





రైతుల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-కోవూరు : రైతులు కోసం వారి అభివృద్ధి కోసం పని చేసేదే పశు గణాభివృద్ధి సంస్థ అని ఏపి డిఎల్డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. కోవూరులోని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు పలు ఉత్పత్తు దారుల సంగం నుంచి, మండల సమాఖ్య నుంచి పలు విభాగాలనుంచి ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. తమ సంస్థ నుంచిపాడి రైతులకు మంచి దూడలు పుట్టేందుకు అందుకు అవసరమైన సెమన్ను ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నామన్నారు. అందుకు సంబంధించి నిధులు కూడా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నాయన్నారు. మాసంస్థ పార్టీ రస్తుల పూయడమే జరుగుతుందన్నారు. బయట రాజకీయంగా ఉండొచ్చు ఏమో గానీ ఇక్కడ మాత్రం రైతు ల కోసం మాత్రమే పని చేస్తామన్నారు. చైర్మన్గా తాను జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే నెల్లూరుకు మంచి గుర్తింపు ఉందన్నారు. దూడలకు అందాల పోటీలు, పొట్టేళ్లకు మంచి విత్తనం అందజేసి రైతుకు మంచి ఆదాయం వచ్చేవిధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పలు నామినేటెడ్ పదవులను రద్దు చేస్తూ పలువురు అధికారుల ఆదేశాలు ఇచ్చారని కాని ఏపి డిఎల్డిఎ చైర్మన్గా గతంలో ఎన్నుకున్న కమిటీనే కొనసాగించమని హైకోర్ట్ ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. పాత కమిటీని రద్దు చేస్తూ గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, దాన్ని సవాల్ చేస్తూ కమిటీ హైకోర్టును సంప్రదించిందన్నారు. ప్రస్తుతం ఉన్న కమిటీ నామినేటెడ్ కమిటీ కాదని ఆ కమిటీకి ఎన్నిక నిర్వహించి ఎన్నుకోవడం జరిగిందని విషయాన్ని పరిగణలోకి తీసుకొన్న హైకోర్టు ఆమేరకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తెలిపారు. .మాసంస్థకే అవసరమైన చింతల దేవిక దేశంలోనే మంచి పేరు ఉందన్నారు. దేశంలో రెండు డెయిరీఫారాలు ఉంటే ఒకటి మద్యప్రదేశ్లో మరొకటి నెల్లూరులోని చింతలదేవికి 2500 ఎకరాల విస్తీర్ణంలో అది ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్కడ దేశంలో ఉన్న అన్నిరకాల జాతుల ఆవులు ఉన్నాయన్నారు. పిండం ఉత్పత్తి ఏర్పాటు చేసేవిధంగా పాటు పడుతున్నామన్నారు. గతంలో అభివృద్ధికోసం దాదాపు రూ.300 కోట్ల నిధులు సమకూర్చేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. కానీ అందులో ఎన్ని కోట్లు నిధులు విడుదల అయ్యాయో పరిశీలించాలి మిగిలిన నిధులు తీసుకోవచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో డిడి శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు నరసింహులు రెడ్డి, జెడిపిటిసి శ్రీంత, వైసిపి మండలాధ్యక్షుడు అనూప్ రెడ్డి, మల్లికార్జున రావు, వెంకటరమణయ్య శ్రీధర్రెడ్డి తదితరులున్నారు.

లబ్ధిదారులు ఎంపిక

ప్రజాశక్తి-దగదర్తి : నూతనంగా నిర్మించబోతున్న గ్రీన్ఫీల్డ్ విమానాశ్రయం కోసం రెవెన్యూ అధికారులు సేకరించిన భూమిలో భూమి కోల్పోయిన లబ్ధిదారులు గుర్తించినట్లు తహశీల్దార్ పి.కృష్ణ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొత్తపల్లి కౌరగుంట సచివాలయంలో గ్రామసభలో సర్వే నెంబరు 334, 335లో 85 ఎకరాలు సంబంధించిన నష్ట పరిహారం అందకుండా ఉన్న 65 మందిని పరిహారం అందించేందుకు గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ గ్రామసభలో పరిహారం అందుకోకుండా ఉన్న వారి పేర్లను చదివి వినిపించారు అంతేగాక సచివాలయంలో నోటీసులు కూడా అందించారు. ఈ సందర్భంగా తాహశీల్దార్ మాట్లాడుతూ ఈ గ్రామ సభలో ఇచ్చిన అర్జీలు ప్రకారం ఆ పది మందిని లబ్ధిదారులుగా గుర్తించినట్లు వారు తెలిపారు. లబ్ధిదారుల జాబితాను కేకేగుంట సచివాలయం, స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నోటీసులు అంటించామని వారు తెలిపారు. ఈ లబ్ధిదారుల జాబితాతో ఎవరికైనా అనుమానాలు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని వారు కోరారు.

ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు

ప్రజాశక్తి-మర్రిపాడు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లో మే 26వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్ తెలియజేశారు. 0-5సంవత్సరాల వయస్సు గల పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రంలో పేరు వద్ద కొత్తగా ఆధార్ నమోదు చేస్తారన్నారు. అలాగే 6సంవత్సరాలు పైబడిన వారికి నివాస ధ్రువీకరణ పత్రం ఇంత వరకు ఆధారకార్డు తీయకపోయినవారికి కొత్తగా ఆధార్ కార్డులు ఇస్తామన్నారు. ఆధార్ కార్డు ఇంతకు మునుపు తీసుకుని వాటిని పోగొట్టుకున్న వారికి ఆధార్ కార్డులు ఇచ్చేందుకు క్యాంపులు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. 26న నందవరం సచివాలయంలో నందవరం, డిసిపల్లి, రామానాయుడుపల్లి, చినమాచనూరు పంచాయతీలు, 27న మర్రిపాడు సచివాలయంలో మర్రిపాడు, అల్లంపాడు, ఇర్లపాడు, ఖాదర్పూర్, పల్లవోలు, 28న బ్రాహ్మణ పల్లి సచివాలయంలో బ్రాహ్మణపల్లి, సింగనపల్లి, కంపసముద్రం, చాబోలు, నాగినేనిగుంట, 29బూదవాడ సచివాలయంలో బూదవాడ, పెగళ్లపాడు, చిలకపాడు ఏపిలిగుంట, 30న చుంచులూరు సచివాలయంలో చుంచులూరు, పిఎన్పల్లి, 31న పొంగూరు సచివాలయంలో పొంగూరు, కేతిగుంట, పొంగూరు కండ్రిక, భీమవరం పంచాయతీలలోని ఎస్టిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ క్యాంపులు విజయవంతం అయ్యేందుకు రాజకీయ నాయకులు, సచివాలయం సిబ్బంది పంచాయతీ సెక్రటరీలు సహకరించాలన్నారు.

రావణసేవలో కామాక్షితాయి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : జిల్లాలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి స్థానిక మండలంలో జొన్నవాడ గ్రామంలో పినాకిని నదీ తీరాన కొలువైన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శుక్రవారం అమ్మవారు రావణ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామి అమ్మవార్లకు గ్రామంలో తిరుచా ఉత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామి అమ్మ వార్లను రావణ సేవ వాహనంపై కొలువు తీర్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా చెవిరెడ్డి సురేందర్ రెడ్డి, శైలజా రెడ్డి హైదరాబాద్ వాస్తవ్యులు, పలగాని సంజీవ్ కుమార్ రెడ్డి, పలగాని వైభవ్రెడ్డి ఉభయకర్తలగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి అమ్మ అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.



నేడు మహానంది సేవలో కామాక్షితాయి

శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి శనివారం మహానంది వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వన్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఆర్వ భూమి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి.రాజేశ్వర రావు ఉత్తర్వులు మేరకు కావలి రూరల్ ఎస్.ఐ కె.బాలకృష్ణ, వారి సిబ్బందితో కలిసి శుక్రవారం కావలి మండలం, మొర్లవారిపాలెం గ్రామ సమీపంలోని పోలాల్లో కోడి పందేలు వేస్తుండగా, వారిపై రైడ్ చేసి ముగ్గురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుండి 1 కోడి పుంజు, రూ.1580లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్కడైనా గ్రామాలలో పేకాట, కోడిపందేలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని ఇన్స్పెక్టర్ జి.రాజేశ్వర రావు ప్రకటనలో కోరారు.

నేడు ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి రాక

ప్రజాశక్తి-విడవలూరు : మండలంలోని జెడ్పి హైస్కూల్, ఆవరణం, విడవలూరు మండలం ఊటుకూరు పల్లిపాలెం గ్రామంలో సురక్షిత మినరల్ వాటర్ ప్లాంట్లును తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి ప్రారంభిస్తారని టిడిపి మండల నాయకులు తెలిపారు. కార్యక్రమానికి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వేసవి సెలవుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎఎస్పేట : అనుమసముద్రం సెక్టార్లో కిషోరీ వికాసం వేసవి సెలవుల క్యాలెండర్ -2025 ఆవిష్కరణ కార్యక్రమం సూపర్వైజర్ జి.కస్తూరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడవ సెషన్ కింద విద్యా కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాల ప్రాముఖ్యత అనే అంశం మీద ప్రోగ్రాం కండక్ట్ చేశారు. 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల కిషోర బాలికలు ఉన్న గ్రామాలలో ఈ ప్రోగ్రాం కండక్ట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జి.ఎం .ఎస్.కె శ్రావణి, అంగన్వాడి టీచర్స్ మహేశ్వరి, ఎస్.కె హసీనా, కామాక్షమ్మ, వనజ, వజ్రమ్మ, కిషోర్ బాలికలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పైలాన్ కూల్చివేతతో సంబంధం లేదు..

కేసు విచారణ అనంతరం కావలి మాజీ ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-కావలి

కావలిలో 20-10-2020న అమ్మక్ పైలాన్ కూల్చివేతకు, తనకు ఎలాంటి సంబంధం లేదని, శుక్రవారం తమకు సంబంధించిన మీడియా వ్యక్తులపైన తప్పుడు కేసులు పెట్టారని, మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్కుమార్ రెడ్డి మీడియాకు తెలిపారు. పైలాన్ కూల్చివేత కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో మీడియా పేరుతో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, వారిని రిమాండ్కు పంపగా, వారు ప్రస్తుతం కావలి సబ్ జైలులో ఉన్న విషయం పాఠకులకు విదితం. ఈ కేసులో పోలీసుల విచారణలో సహకరించాలన్న కోర్టు ఆదేశాలతో శుక్రవారం ఉదయం రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కావలి 2 వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్.ఐ. గిరిబాబు ముందు హాజరయ్యారు. పోలీసులు ఆయనను 42 ప్రశ్నలువేశారు. వాటికి సమాధానం చెప్పి బయటకు వచ్చిన రామిరెడ్డి మీడియాతో మాట్లాడారు. దాదాపు 6 గంటల 30 నిముషాలపాటు జరిగిన పోలీసుల విచారణ కు సహకరించానన్నారు. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందన్నారు. పైలాన్ కూల్చి వేతకు తనకు సంబంధం లేదన్నారు. కుట్ర కోణంలోనే తనపైనా, తమకు సహకరించిన మీడియాపై కేసులు పెట్టారన్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడాన్ని తాము సహకరించమన్నారు. మీడియా కోటే "ప్రెస్మీట్" కోసం అప్పటికి ఖాళీగా ఉన్న "అన్న క్యాంటీన్" చూపించామన్నారు. అంతే తప్ప, పైలాన్ తాము కూల్చలేదన్నారు. ఎవరో కూల్చితే, పెట్టిన కేసును, పోలీసులు మూసివేశారన్నారు. టిడిపి ప్రభుత్వం కక్ష సాధింపుగా కేసును మళ్లీ తెరచి, అక్రమంగా తమను కేసులో చేర్చారన్నారు. తమతోపాటు మీడియా వ్యక్తులను కూడా చేర్చారన్నారు. ఎప్పటికీ ప్రజల తరఫున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, జగన్మోహన్ రెడ్డి, తాను పోరాటం చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ చేసే అరాచకాలను కూడా బయటపెడతామ న్నారు. ఆయనతోపాటు అడ్వకేట్ ఎస్.ఎక్స్. కేనడీ, పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్కుమార్రెడ్డి

గ్రామస్థాయిలో చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

గ్రామ స్థాయిలో పేద ప్రజలకు పలుకురాల చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి పేర్కొన్నారు. స్థానిక మండలంలోని పంచేడు గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సుని శుక్రవారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సులు గ్రామాలలో ఏర్పాటుచేసి పేద ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ప్రభుత్వం ద్వారా సమస్యలను పరిష్కరించాలా న్నారు. పేద ప్రజల సమస్యలపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తే డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకెళ్లి సహాయం పొందవచ్చని ఆమె తెలియజేశారు. మహిళల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మికుల గురించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ ప్రజలు అర్జీలు ఆమెకు అందజేయగా వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యులు మారంరెడ్డి సుబ్బారెడ్డి, తహశీల్దార్ అంజలి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ శ్రీహరి, ఎసిఐ సంతోష్ రెడ్డి, ఎపిఎం శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

వివాహ వేడుకల్లో ఎంఎల్ఎ కాకర్ల

ప్రజాశక్తి-కలిగిరి

మండలంలోని క్రాకుటూరు పంచాయతీ లోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో రావూరి పెంచల్ రెడ్డి - పద్మ కుమారుడు ఫణింద్ర రెడ్డి వివాహ వేడుకలలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కలిగిరి మండల నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





జెవివి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వరికుంటపాడు

జనవిజ్ఞాన వేదిక వరికుంటపాడు మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక మండల సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జెవివి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, జిల్లా కోశాధికారి పి.మాల్యాచలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెవివి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రజలందరూ మూఢనమ్మకాలను విడనాడాలని శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలియజేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక, జిల్లా మహాసభ, భవిష్యత్తు కార్యక్రమాలు చర్చించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎం. సుబ్బారావు, వైవి సుబ్బయ్యలు, ఎస్.కె.కరిముల్లా, ఉపాధ్యక్షులుగా ఎం.ఆంజనేయులు, పి.రసూల్ ప్రధాన కార్యదర్శిగా డివి రమణయ్య, కోశాధికారిగా టీ హజరత్తయ్య, సమన్వయ కర్తలుగా టీ చెన్నకేశవులు, నాదెండ్ల రమణయ్య, 15మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నుకున్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా చంద్రారెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులుగా తుమ్మల చంద్రారెడ్డిని మరోసారి ఎంపిక చేయడంపై ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి చంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకత్వం తనను ఆత్మకూరు మున్సిపాలిటీ కన్వీనర్గా నియమించడం గర్వకారణంగా ఉందన్నారు. తనపై నమ్మకాన్ని ఉంచిన పార్టీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ ఆవిర్భావం కోసం నిజాయితీగా, నిబద్ధతతో పనిచేయడమే తన ధ్యేయమన్నారు. దానికి సహకరించిన ఆత్మకూరు మున్సిపాలిటీలోని తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. చంద్రారెడ్డికి అధ్యక్ష పదవి ఇవ్వడంపై ఆ పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు పలువురు కౌన్సిలర్లు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-సీతారాంపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భాస్కరరావు మాట్లాడుతూ మైనారిటీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం కోరారు. అర్హత ఆసక్తి కలిగిన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో స్థానిక సచివాలయంలో మీసేవా కేంద్రాలలో 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండలానికి ఐదు యూనిట్ల మంజూరైనట్లు ఆయన స్పష్టం చేశారు.

దళారీ వ్యవస్థపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-దగదర్తి

దగదర్తి విమానాశ్రయ భూసేకరణ పరిహారం పంపిణీలో కొంతమంది దళారీల అవతారం ఎత్తి లబ్ధిదారులు బాధితుల వద్ద నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా వసూలు చేస్తున్నట్లు ఆధారాలు దొరికినట్లైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కావలి ఆర్డిఒ వంశీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం దగదర్తి తహశీల్దార్ కార్యాలయంలో విమానాశ్రయ భూ సేకరణలో భూములు కోల్పోతున్న లబ్ధిదారులు బాధితులతో సమావేశమైన ఆయన భూములు కోల్పోతున్న వారు అధికారులకు కానీ దళారీలకు కానీ ఎటువంటి నగద చెల్లించాల్సిన అవసరం లేదని అలా ఎవరైనా డిమాండ్ చేస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకొస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. కేకేగుంట గ్రామంలోని సర్వే నంబర్ 334, 335లలో 65 మంది లబ్ధిదారుల పేర్లపై గతంలో ఆక్షేపణలు వచ్చి ఉన్నాయని గత పది రోజుల నుండి ఈ విషయమై గ్రామసభలు నిర్వహించి నిజమైన లబ్ధిదారులు ఎవరు తేల్చే ప్రక్రియలో తాము తమ సిబ్బంది నిమగ్నమై ఉన్నామన్నారు. 65 మంది లబ్ధిదారులకు సంబంధించి కొంతమంది ఇంటిపేర్లు మారి ఉండగా మరి కొంతమంది తండ్రి పేర్లు తప్పుగా నమోదై ఉన్నాయని ఫిర్యాదులు వచ్చి ఉన్నాయన్నారు. ఈ విషయమై రికార్డులను సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయి విచారణ అనంతరం పరిహారం పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దామవరం గ్రామంలోని వన్ బై వన్ సర్వే నెంబర్లోనే సుమారు 400 ఎకరాల భూమి జిల్లా కలెక్టర్ స్థాయిలో తుది దశ విచారణలో ఉందన్నారు. అలాగే దామవరం గ్రామ సర్వే నెంబర్ 238నుండి 259వరకు కూడా జిల్లా కలెక్టర్ స్థాయిలో తుది దశ నిర్ణయంలో ఉందన్నారు. కేకేగుంట గ్రామంలోని సర్వే నెంబర్ 334 335లలో ఇప్పటివరకు 10మంది నిజమైన లబ్ధిదారులు అని గుర్తించి సంబంధిత సచివాలయంలో జాబితాను ప్రచురించి ఉన్నామని దానిపై అభ్యంతరాలు ఆక్షేపణలు ఉన్నట్లయితే తహశీల్దార్ దగదర్తి వారికి తెలపాలన్నారు. మండలంలోని పలు గ్రామాలలో నేషనల్ సర్వే నంబర్ల విషయమై వివరణ కోరగా ఇది ఒక దగదర్తి మండలంలోనే కాక డివిజన్లోనే కాక జిల్లాస్థాయిలో ఉందన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు చేపడతామన్నారు. విమానాశ్రయ భూములలో అనుభవంలో ఉండి రికార్డుల లేని వారి విషయమై వివరణ కోరగా సుమారు రూ.100 కోట్ల వరకు నష్టపరిహారం పంపిణీ చేయాల్సి ఉందని కేకేగుంట గ్రామంలో పంపిణీ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.కృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ గిరీష్, ఆర్ఐ శివకుమార్, విఆర్ఒలు వేణు బాలనాగమ్మ, గౌతమ్, నాగరాజు, తదితరులున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డిఒ వంశీకృష్ణ

ప్రభుత్వ భూమిని అటవీశాఖకు అప్పగించొద్దు..

ప్రజాశక్తి- సీతారాంపురం

ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు అప్పగించద్దని యు వి కృష్ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం వివిధ పనుల నిమిత్తం అటవీ శాఖ నుండి తీసుకున్న భూములకు మండలంలోని చిన్ననాగంపల్లి. దేవరాజు సూరయ్యపల్లెలో రెవెన్యూ భూములు పరిశీలిస్తామని గ్రామ ప్రజల ఒప్పందంతోని అనుమతి ఇస్తామన్నారు. ఈ గ్రామాలలో భూమిలేని పేదవారు చాలామంది ఉన్నారని వారికి కేటాయించకుండా ఫారెస్ట్ వారికి ఇవ్వటం ఏమిటి అని కొందరు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలేని నిరుపేదలు గ్రామంలో చాలా మంది ఉన్నారని నిరుపేదలకు మాత్రమే ఆ భూములు కేటాయించాలని వారు తహశీల్దారు వద్ద వాపోయారు. అటవీశాఖకు భూములు కేటాయించడం అనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు కోరారు. సర్పంచ్ ముత్తూరు వెంకటసుబ్బయ్య, ఆర్ఐ శ్రీనివాసులు విఆర్ఒలు మురళి, మనోహర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే జరిమానా..

ప్రజాశక్తి-కావలి

పురపాలక సంఘాల పరిధిలో 40 మైక్రాన్ల కన్నా తక్కువ గేజ్ ఉన్న ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు చేసిన, వినియోగించినా, అపరాధ రుసుము ఉంటుందని లోక్సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండా రెడ్డి ప్రజలకు తెలిపినారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్ల నిషేధ చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకొని, ప్లాస్టిక్ కవర్లను నియంత్రించే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని దానికి పౌరసంస్థలు పురపాల శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం కోసం ప్లాస్టిక్ వినియోగించడం వల్ల కలిగే దుష్ఫలితాలు కేన్సర్ లాంటి వ్యాధులు ప్రబలుతున్నా యని వైద్య విజ్ఞానం తెలుపుతున్నది అందువల్ల ప్లాస్టిక్ కవర్లను నియంత్రించి, గుడ్డ సంచులు దోనెలు ఇస్తరాకులు లాంటివి శుభకార్యాలలో నిత్యజీవితంలో వినియోగించుకుని పర్యావరణాన్ని రక్షించుకోవాలని కోరారు.

పన్ను సవరణలపై సమీక్ష

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలో ప్రస్తుతం అమలవుతున్న ఇంటి పన్నులను సవరించేందుకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ డి.బాలకృష్ణ ఆధ్వర్యంలో పన్ను సవరణల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా మౌలిక వసతులు కల్పించేందుకు పట్టణంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు పన్నుల ద్వారా సేకరించిన మొత్తాలను కేటాయించగలమన్నారు. అందుకు పన్ను సవరణల సర్వేలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ సర్వే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని కార్యదర్శులు ప్రతిరోజు క్షేత్ర స్థాయిలో పర్యటించి రెవెన్యూ వసూళ్లను గత ఏడాది కన్నా 20శాతం అదనంగా పెంచాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వ్యవహరిస్తే, నిర్దేశించిన పనులలో అలసత్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

అగ్నిప్రమాద బాధితునికి రెడ్క్రాస్ సాయం

ప్రజాశక్తి-కావలి : కొండాపురం రామానుజపురం గ్రామానికి చెందిన బండ్లమూడి మధుబాబు ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోవడంతో, కావలి రెడ్క్రాస్ను సంప్రదించగా అతనికి తక్షణ సహాయం అందజేశారు. అతనికి వంటపాత్రల కిట్, దుస్తుల కిట్ అందజేశారు. కార్యక్రమంలో రెడ్క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్. కె.హరినారప రెడ్డి, పాలకమండలి సభ్యులు నల్లిపోగు ప్రణీత్, కార్యదర్శి బి యస్ ప్రసాద్ పాల్గొన్నారు.



తెలుగువాడి గొప్పతనానికి 'మహానాడు' నాంది..

ప్రజాశక్తి-కావలి



తెలుగువాడి గొప్పతనానికి నాంది పలుకుతూ ఏర్పాటు చేసుకున్న సభ 'మహానాడు' అని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ మహానాడు కార్యక్రమం నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేదవాడు పేదవాడిగా మిగిలి పోకూడదు, పేదవాడికి ధనవంతుడికి మధ్య తారతమ్యాలు పెరగకుండా ఉండాలి, పేదవాడిని అక్కున చేర్చుకోవాలి, తెలుగు భాషను తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడానికి, తెలుగువాడి ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటి చెప్పటానికి దివంగత నందమూరి తారక రామారావు ఏర్పాటు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ముఖ్యంగా చంద్రబాబు కృషి వల్ల కావలి నియోజకవర్గం బాగా వెలుగొందుతుందని, బాగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నెల్లూరు జిల్లాకి తలమానికంగా ఉండబోయే విధంగా బిపిసిఎల్ కంపెనీని కావలి నియోజవర్గానికి అందించిన ముఖ్యమంత్రికి మనందరం కూడా ధన్యవాదాలు చెప్పాలన్నారు. గత ఐదు సంవత్సరాలు విధ్వంసమైన పరిస్థితుల్లో నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు దగదర్తి విమానాశ్రయానికి భూమి పూజ చేస్తే, గత ఐదు సంవత్సరాల విధ్వంసంలో ఆ భూమిలోనే గ్రావెల్ తవ్వుకున్న సంఘటలు జరిగాయన్నారు. విమానాశ్రయాన్ని తిరిగి దగదర్తికి అందించిన ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. పోలవరం, అమరావతి ఇవన్నీ కూడా ఆంధ్ర ప్రజలకు ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి అదేవిధంగా లోకేష్ బాబుకి మనందరం కూడా ధన్యవాదాలు తెలియజేయాలన్నారు. అనంతరం కావలికి సంబంధించిన తీర్మానాలను అమోదించాలని ఎంఎల్ఎ కోరారు.

నగదు వసూలు చేయాలి

ప్రజాశక్తి-ఎఎస్పేట

మండలంలో మండల సమాఖ్యలో ఈసీ మీటింగ్ ఎపిఎం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎజెండా అంశాలు ప్రకారంలో రివ్యూ చేశారు. ఎసివన్హెచ్ అప్డేషన్ గురించి, ఆజీవిక జియో, ఫేసింగ్ యాప్ గురించి స్త్రీనిధి రికవరీ ఉన్నతి రికవరీ సిఐఎఫ్ వసూరీళ్లల గురించి, ఉమన్ లెటడ్ ఎంటర్ప్రైస్ గురించి ఎస్ హెచ్ జి యాప్లో ఎలా చేయాలో వివరించారు. సమావేశంలో సిసిలు ఎస్ఎన్ మేనేజర్, అకౌంటెంట్ విఒఎలు, మండల సమైక్య సభ్యులు, మండల గ్రామ స్థాయిలోని విఒ అధ్యక్షులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కావలి

కావలిలోని మూడో వార్డులో తోట రాజేష్, తుమ్మల బాబి ఆధ్వర్యంలో, జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జనసేన పార్టీ సభ్యత్వ కిట్లును శుక్రవారం జన సైనికులకు, వీర మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5లక్షలు ఇన్సూరెన్స్, తీవ్ర గాయాలు తగిలితే, రెండు లక్షల 50 వేల రూపాయలు ఇన్సూరెన్స్, స్వల్ప గాయాలు తగిలితే, రూ.50 వేలు ఇన్సూరెన్స్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి కావలి పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయి విఠల్, పవన్ కళ్యాణ్ అభిమాన సంఘ నాయకుడు ఆలా శ్రీనాథ్, పట్టణ ఉపాధ్యక్షులు గాదంశెట్టి రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి తోట శరన్, సీనియర్ నాయకులు తోకల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, 29వ వార్డు ఇన్ఛార్జ్ జానీ, 16వ వార్డు ఇన్ఛార్జ్ షేక్ జిలాని, 22వ వార్డు ఇన్ఛార్జ్ షేక్ షమీ, సీనియర్ నాయకులు జిల్లెల్ల కొండయ్య, 39వవార్డునాయకులు ఆకుల మహేష్, 33వ వార్డు నాయకులు రాఘవ, వీర మహిళ జ్యోతి, కొణిదల సందీప్, సోమిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు విద్య అవసరం

ప్రజాశక్తి-బిట్రగుంట



విద్యార్థుల లక్ష్య సాధనకు విద్య చాలా అవసరమని సూపర్ వైజర్ కోటేశ్వరి అన్నారు. శుక్రవారం ఉమామహేశ్వరి పురంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కిశోరీ వికాసం కార్యక్రమంలో సూపర్వైజర్ కోటేశ్వరి పాల్గొని మాట్లాడుతూ వ్యక్తిగత సామాజిక ఎదుగుదలకు విద్యా ప్రాథమికమైనదన్నారు. సామాజిక ఆర్థిక అసమానతలు తగ్గించడం విమర్శనాత్మకంగా ఆలోచించడానికి ప్రశ్నించడానికి విద్య దోహదం చేస్తుందన్నారు. పిల్లలను చిన్నతనం నుండి అంగన్వాడి సెంటర్కు పిల్లలను పంపే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఎఎస్పేట



మండల కేంద్రమైన అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో కిషోరీ బాలికల ఉన్నత విద్య నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వంపై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పేట సెక్టార్ సూపర్వైజర్ పి విజయలక్ష్మి మాట్లాడుతూ కిశోరీ బాలికలను ఉద్దేశించి వ్యక్తిగత, సామాజిక ఎదుగుదలకు విద్య ప్రధానమైన అంశమని తెలియజేశారు. సంతోషకరమైన జీవితానికి విద్య ప్రామాణికమని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని విద్య అందిస్తుందని, సమానత్వాన్ని పెంపొందిస్తుందని, ఆడపిల్లలందరూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కే.విజయలక్ష్మి, పి. సావిత్రి, ఎం.సుశీలమ్మ, పి.షాకిర బేగం, జి.ఇందిర, కె.కృష్ణకుమారి పాల్గొన్నారు.